
వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలనీ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని ప్రసిద్ధ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ ఛైర్మన్ ముద్దగోని సతీష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హాజరై శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు.


సమస్యలను జడ్‌సీకి వివరిస్తున్న కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్

అసంపూర్తి పనులను పూర్తి చేస్తాం: జడ్‌సీ

మన్సూరాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్‌లో అసంపూర్తిగా ఉన్న పనులను, ముఖ్యంగా రోడ్డు పనులను త్వరలో చేపట్టి పూర్తిచేస్తామని జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. నాగోల్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్‌తో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చింతల అరుణ సాయినగర్‌కాలనీ నుంచి ఆర్టీఓ కార్యాలయం వరకు, బండ్లగూడ నుంచి శ్రావణి ఎన్‌క్లేవ్ వరకు, జైపురికాలనీ చౌరస్తా నుంచి రాజ్యలక్ష్మీ కాలనీ వరకు చేపట్టిన వరదనీటి నాలా పైప్‌లైన్ పనులు పూర్తియ్యి నెలలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పలు ప్రాంతాల్లో రోడ్ల దుస్థితిని గురించి జెడ్సీకి కార్పొరేటర్ వివరించారు. స్పందించిన జోనల్ కమిషనర్ హేమంత కేశవ్‌పాటిల్ సాధ్యమైనంత తొందరగా పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రనాథ్ యాదవ్, ఈఈ రమేష్‌బాబు, డీఈలు కనకయ్య, నీలిమ, ఏఈ దీపక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వివిధ కాలనీవాసులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


వరద నీటి కాల్వ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

పైప్‌లైన్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోండి

కొత్తపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎస్ఆర్ఎల్ కాలనీలో వరదనీటి కాల్వ పనులు జరుగుతున్న నేపథ్యంలో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జలమండలి అధికారులకు, కాంట్రాక్టర్‌కు కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కాల్వ పనులు చేస్తున్న సందర్భంలో ఇతర పైప్‌లైన్లు పాడైతే వెంటనే వాటికి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్, ఏఈ శరీఫ్, జలమండలి డీజీఎం రవీంద్రవర్మ, ఏఈ స్రవంతీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రిలియంట్ కాలేజీలో చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

● పరారీలో మరో ముగ్గురు నిందితులు

కొత్తపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్‌లో గల బ్రిలియంట్ ఇంజనీరింగ్ కాలేజీలో గత నెల 10 జరిగిన చోరీ కేసును రాచకొండ పోలీసులు ఛేదించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలో ముగ్గురు నిందితులను అరెస్టుచేసి రూ 37,05,000 స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. మంగళవారం ఎల్బీనగర్ జోన్ డీసీపీ అనురాధ తన కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడించారు. బ్రిలియంట్ ఇంజనీరింగ్ కాలేజీలో చోరీ కేసుకు సంబంధించి మంగళవారం తెల్లవారు జామున పోలీసులు కొత్తగూడ క్రాస్‌రోడ్స్‌లో గుజరాత్‌కు చెందిన బీటెక్ విద్యార్థి రాజ్ మనోహర్ పవార్(24), మధ్యప్రదేశ్‌కు చెందిన బీఏఎల్ఎల్‌బీ విద్యార్థి రితిక్ అలియాస్ మోహిత్(24) ఒక మైనర్(16)తో కలిపి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ 37,05,000 స్వాధీనం చేసుకున్నారు. గుజరాత్‌కు చెందిన దినేష్ మోహిత్, మధ్యప్రదేశ్‌కు చెందిన అరుణ్‌మోహిత్, మహారాష్ట్రకు చెందిన విలాస్ చౌహాన్‌లు పరారీలో ఉన్నారు. సమావేశంలో ఏసీపీ కాశిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ ఎస్‌హెచ్‌ఓ అశోక్‌రెడ్డి, సీసీఎస్ తదితర విభాగాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మీర్‌పేట్‌లో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో పాల్గొన్న కమిషనర్ నాగమణి తదితరులు

సరూర్ నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మీర్‌పేట్ మునిసిపల్ కమిషనర్ నాగమణి సూచించారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్, ప్రశాంతినగర్ ప్రాంతాలకు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తైంది. మంగళవారం గృహ ప్రవేశం చేశారు. ఆయా కార్యక్రమాల్లో కమిషనర్ నాగమణి పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, మునిసిపల్ సిబ్బంది, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు అధికారులు, ఇళ్ల లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదలకు చేయూతనివ్వడమే లక్ష్యం : శ్రీనివాస్‌గుప్తా


బాలలక్ష్మికి పుస్తెమట్టెలు, చీరగాజులను అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా, స్వప్న దంపతులు

మన్సూరాబాద్ , నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న నిరుపేదలకు చేయూతనందించి వారిని ఆదుకోవడమే లక్ష్యంగా ఉప్పల ఫౌండేషన్ ముందుకు సాగుతోందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. ఖైరతాబాద్‌లోని వాసవి ఆస్పత్రిలో పనిచేసే నిరుపేద కుటుంబానికి చెందిన సాయికి అనూషతో వివాహం నిశ్చమైంది. విషయం తెలుసుకున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మంగళవారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సాయి, అనూష వివాహానికి పుస్తెమట్టెలు, చీరగాజులు ఉప్పల ఫౌండేషన్ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయి, తల్లి బాలలక్ష్మి తదితరులు ఉన్నారు.


కుంట్లూర్‌లో ఎస్టీపీ ఏర్పాటు చేయనున్న కాట్‌కోనిబావి కుంట ఇదే


పెద్దఅంబర్‌పేట్ ఇళ్ల మధ్యలో ఎస్టీపీ ఏర్పాటుకు అధికారులు కేటాయించిన చెరువు స్థలం


పెద్దఅంబర్‌పేట్‌లో ఎస్టీపీకి కేటాయించిన స్థలం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్థులు, కాలనీవాసులు

పెద్దఅంబర్‌పేట్‌కు సీవరేజ్ ఫీవర్

● మున్సిపాలిటీలో రెండు చోట్లా ఎస్టీపీల నిర్మాణానికి చర్యలు
● కాలనీల నడుమ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న స్థానికులు
● ప్రభుత్వ తీరుపై ఆగ్రహ జ్వాలలు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగర శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ ప్రజలకు సీవరేజ్ ఫీవర్ పట్టుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఆయా మున్సిపాలిటీలలో సుమారు 45 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. వాటికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ సైతం పూర్తి చేసి కాంట్రాక్టర్లకు అప్పగించింది. అందులో భాగంగా పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో రెండు చోట్లా ఎస్టీపీలను ఏర్పాటు చేయనున్నారు. విజయవాడ జాతీయ రహదారికి ఎడమ వైపున ఉన్న కుంట్లూర్‌లో, కుడి వైపున ఉన్న పెద్దఅంబర్‌పేట్‌లో ఒక ఎస్టీపీని ఏర్పాటు చేయనుంది. ప్లాంట్‌కు అవసరమైనా స్థలాలను కూడా హెచ్ఎండబ్ల్యూఎస్/ఎస్‌బీకి అప్పగించింది. దీంతో సంబంధిత శాఖ అధికారులు పనులను ప్రారంభించారు.

ఇళ్ల మధ్య ఏర్పాటుతో..

మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్‌లో సర్వే నంబర్ 107లో 9 ఎకరాలు, పెద్దఅంబర్‌పేట్‌లో సర్వే నంబర్ 292లో 3 ఎకరాల్లో ప్రభుత్వం ఎస్టీపీలను ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వం ప్రతిపాదించిన స్థలాల చుట్టూ పదుల సంఖ్యలో కొత్త కాలనీలు వెలిశాయి. ప్రస్తుతం అక్కడ వేల సంఖ్యలో ప్రజలు నివాసం ఉంటున్నారు. కాలనీ మధ్య ఎస్టీపీలను ఏర్పాటు చేస్తున్న విషయం తెలియడంతో ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. నవంబరు 3న కుంట్లూర్‌లో ఎస్టీపీ పనులను ప్రారంభిస్తుండగా విషయం తెలుసుకున్న కనకదుర్గానగర్, జూబ్లీనగర్, షిరిడీ సాయినగర్, రాఘవేంద్రానగర్, ప్రజయ్‌గుల్మోర్, భవానీనగర్ తదితర కాలనీ వాసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని పనులను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. కనీస సమాచారం లేకుండా ఇళ్ల మధ్యలో ఎస్టీపీని ఎలా ఏర్పాటు చేస్తారని ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కాంట్రాక్టర్, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులతో వాగ్వాదం చేశారు. ప్రజా అభిప్రాయ సేకరణ చేయకుండా ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. పెద్దఅంబర్‌పేట్ మునగనూర్ రోడ్డులో 3 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఎస్టీపీ పనులను కాంట్రాక్టర్ రెండు రోజుల క్రితం ప్రారంభించగా మంగళవారం సమీప అంబికానగర్, స్వగృహ కాలనీ, పోలీస్‌కాలనీ, దయాకర్‌రెడ్డి కాలనీ వాసులతో పాటు పెద్ద అంబర్‌పేట్ గ్రామస్థులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. పక్క గ్రామాల డ్రైనేజీ తీసుకువచ్చి పెద్దఅంబర్‌పేట్‌లో శుద్ధి చేయడం ఏమిటని హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులను నిలదీశారు. వెంటనే పనులను నిలిపివేయాలని అప్పటి వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ భీష్మించారు. వారం రోజుల పాటు పనులను ఆపేయాలని... అప్పటిలోగా ఎమ్మెల్యేతో మాట్లాడి సమస్య పరిష్కరించుకుంటామని మాజీ కౌన్సిలర్లు, కాలనీ వాసులు కోరారు. దీంతో పనులకు బ్రేక్ పడింది.

చెరువు, కుంటల్లో ఎస్టీపీలా...?

చెరువు, కుంటలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా హైడ్రా వ్యవస్థను తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. అయితే, అదే ప్రభుత్వం ఎస్టీపీల ఏర్పాటు కోసం చెరువు, కుంటల స్థలాలను కేటాయించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుంట్లూర్ సర్వే నంబర్ 107లో ఎస్టీపీకి కేటాయించిన 9 ఎకరాలు కాట్‌కోనిబావికుంట కాగా, పెద్దఅంబర్‌పేట్ 292 ఈదుల చెరువు సర్వే నంబర్‌లో 3 ఎకరాలను ఎస్టీపీల కోసం కేటాయించారు. దీనిపై ఆయా గ్రామాల నాయకులతో పాటు కాలనీల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు చెరువులను రక్షిస్తున్నట్లు పేర్కొంటూనే మరోవైపు అదే చెరువు, కుంటలను ప్రభుత్వమే కనుమరుగు చేస్తుందని ఆరోపిస్తున్నారు.

జనావాసాల్లో ఎస్టీపీలు వద్దు



ఇళ్ల మధ్యలో కాకుండా కాలనీలకు దూరంగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో ఎస్టీపీలను ఏర్పాటు చేయండి. జనావాసాల మధ్యలో ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలయ్యే అవకాలు ఉన్నాయి. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి. ఇక్కడ పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయండి.

- చెట్టుపల్లి అంబేడ్కర్, అంభికానగర్ కాలనీ అధ్యక్షుడు

ఊపిరి ఆగకూడదంటే సిగరెట్లు ఆపాలి

● రాచకొండ సీపీ సుధీర్ బాబు
● కామినేని ఆస్పత్రిలో సీఓపీడీపై అవగాహన



సీఓపీడీ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ/మన్సూరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఊపిరి ఆగకుండా ఉండాలంటే పొగతాగడం ఆపాల్సిందేనని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. అంతర్జాతీయ సీఓపీడీ డే సందర్భంగా ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ రవీందర్ రెడ్డితో కలిసి సీఓపీడీ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎక్కువ కాలం పాటు పొగతాగడం వల్ల క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ) వచ్చే అవకాశముందని, నయం చేయడానికి సాధ్యం కాని ఈ వ్యాధి రాకుండా ఉండాలంటే ధూమపానం మానేయాలని సూచించారు. కామినేని ఆస్పత్రి సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ సీఓపీడీ సాధారణంగా 60 ఏళ్లు దాటిన తర్వాత వచ్చే సమస్య, ఎప్పుడో సిగరెట్‌లు కాల్చి మానేశామనుకున్నా అప్పటికే నష్టం జరగి ఉండవచ్చని అన్నారు. సిగరెట్‌లు తాగేవారితోపాటు పొగ పొయ్యిల వద్ద పనిచేసేవారికి కూడా ఈ సమస్య వచ్చే అవకాశముందని ఆయన తెలిపారు. సీఓపీడీ సమస్యను వీలైనంత ముందుగా గుర్తిస్తే నష్టాన్ని కొంతవరకైనా తగ్గించే అవకాశముందని అన్నారు. సీఓపీడీని గుర్తించేందుకు పల్మనరీ ఫంక్షన్ టెస్ట్ ఒకటే మార్గమని, దీనికి రూ. 3వేల వరకు ఖర్చు అవుతుందని, సీఓపీడీ డే సందర్భంగా కామినేని ఆస్పత్రిలో ఈ పరీక్ష, కన్సల్టెన్సీ రెండూ కలిపి కేవలం రూ.400 లకే ఈనెల 22 వరకు అందిస్తున్నామని, ధూమపానం అలవాటు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కామినేని అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్‌బాబు పద్మల్, మెడికల్ సూపరింటెండ్ డాక్టర్ అంజయ్య కనుసోలి, సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్ శుభకర్ కంది, పల్మనాలజిస్టులు రవీంద్రనాథ్, డీఎస్ సౌజన్య, భరత్ జానపాటితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఐక్యత, భాష సమతుల్యత కోసం
అధికారిక భాషగా హిందీ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి

చంపాపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): హిందీని అధికారిక భాషగా చేయడం అనేది పరిపాలనిక నిర్ణయం మాత్రమే కాకుండా జాతీయ ఐక్యత, భాషా సమతుల్యత కోసం తీసుకున్న సాంకేతిక నిర్ణయమని ఆఫ్రికా దేశం ఇథియోపియోలోని అర్బామించ్ విశ్వవిద్యాలయం భాషాశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ గోపాలశర్మ అన్నారు. కంచన్‌బాగ్‌లోని మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్(మిధానీ)లో మంగళవారం హిందీ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిధాని సీఎండీ డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన రాజ్యాంగంలో అధికారిక భాష ప్రతిపాదన, దక్షిణ భారతీయుల సహకారంపై నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ డాక్టర్ గోపాల శర్మ హాజరై మాట్లాడారు. అనంతరం మిధాని సీఎండీ మాట్లాడుతూ హిందీ కేవలం ఒక కమ్యూనికేషన్ మాధ్యమం మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతికి గుర్తింపుతో పాటు ఐక్యతకు చిహ్నంగా ఉందని అన్నారు. 1949లో సెప్టెంబరు 14న రాజ్యాంగ సభ హిందీని అధికారిక భాషగా గుర్తించిందని ఆయన గుర్తు చేశారు. హిందీ టైపింగ్, స్పీచ్, పదజాలం, క్విజ్ పోటీలలో గెలుపొందిన బీడీపీఏపీ పాఠశాల విద్యార్థులకు అతిథులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మిధాని డైరెక్టర్(ఫైనాన్స్) కె.మధుబాల, మిధాని డైరెక్టర్(ఉత్పత్తి, మార్కెటింగ్) పి.బాబు, ఏజీఎం శుభదీప్ ఘోష్, నిశాంక్ కుమార్ జైన్, డాక్టర్ జీఆర్ ప్రవీణ్‌జ్యోతి, గరామా ఓజా, ఉమేంద్రసింగ్, ఉద్యోగులు సాయిబాబా, గౌతమి, పి.వర్ష, కె.సురేఖ, విజయనాథ్, కుష్వాహ, డాక్టర్ బాలాజీ, రత్నకుమారి, వికాస్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.


నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

● పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి సూచించారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇంజనీరింగ్ కళాశాల, కుంట్లూర్ మహిళ స్వశక్తి భవనం వద్ద ఎస్‌హెచ్‌జీ కాలనీ వాసులతో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలైన వారిని గుర్తిస్తే వెంటనే 14446 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ సుమంత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరికుమార్, శ్రీనివాస్, సరోజా తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌రహిత సమాజ స్థాపనలో విద్యార్థుల పాత్ర కీలకం

సరూర్‌నగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌రహిత సమాజ స్థాపనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉన్నదని బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. 'నషా ముక్త్ భారత్'లో భాగంగా మంగళవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది, విద్యార్థులు కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డ్రగ్స్ అబ్యూస్ వింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ జ్యోతి, డాక్టర్ వెంకటరెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దర్శకుడు రాజమౌళిపై సరూర్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదు

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి ఇటీవల జరిగిన వారణాసి చిత్రం ఈవెంట్‌లో ఆంజనేయస్వామిపై చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయంటూ రాష్ట్రీయ వానర సేన గోరక్షక రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌కుమార్ జోషి సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వలాభం కోసం మతాల మధ్య చిచ్చుపెట్టేలా స్వార్థంతో వ్యాఖ్యలు చేసిన రాజమౌళిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నాయీ బ్రాహ్మణులు రాజకీయంగా రాణించాలి


నాయీ బ్రాహ్మణ జన జాగృతి పాదయాత్రలో విశారదన్ మహరాజ్

మన్సూరాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణులు తమ హక్కుల కోసం పోరాడుతూ రాజకీయ రంగంలోనూ రాణించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఛైర్మన్ విశారదన్ మహరాజ్ సూచించారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నాయీ బ్రాహ్మణ జన జాగృతి అధ్యక్షుడు ఉప్పునుంతల బాలకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల నుంచి ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వరకు నాయీ బ్రాహ్మణులు పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశారదన్ మహరాజ్ విచ్చేసి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉప్పునుంతల బాలకృష్ణ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, నామినేటెడ్ పదవుల్లో అవకాశాలివ్వాలని కోరారు. నాయీ బ్రాహ్మణుల హక్కుల కోసం, డిమాండ్లను నెరవేర్చే వరకు తమ పోరాటం ఆగదని అన్నారు. ఈ యాత్రలో నాయీ బ్రాహ్మణ జన జాగృతి రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాగిళ్ల ప్రవీణ్, సంయుక్త కార్యదర్శి శికిలమెట్ల ప్రభాకర్, సలహాదారు కొత్తపల్లి రవి, నాయకులు పి.బిక్షపతి, ఎం.ప్రవీణ్, శ్రీకాంత్, యాదగిరి, మధు, హరీష్, రాజు, కొలనుపాక రాములు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కావేరి ట్రావెల్స్ బస్ టైర్లలో పొగలు

● గమనించిన ప్రయాణికులు, తప్పిన ప్రమాదం
● పెద్ద అంబర్ పేట్ వద్ద ఘటన

అబ్దుల్లాపూర్ మెట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న కావేరి ట్రావెల్స్ బస్సు వెనుక టైర్ల నుంచి పొగలు వచ్చాయి. నగరం నుంచి 26 మంది ప్రయాణికులతో శ్రీకాకుళం బయలుదేరిన ట్రావెల్స్ బస్సు నగర శివారు పెద్ద అంబర్‌పేట వద్దకు మంగళవారం రాత్రి దాదాపు 10గంటలకు చేరుకోగానే ఓవర్ హీట్‌తో వెనుక టైర్ల నుంచి పొగలు వచ్చాయి. పొగలను గమనించిన ప్రయాణికులు వెంటనే డ్రైవర్‌కు తెలిపారు. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సును పక్కకు ఆపి ప్రయాణికులను కిందకు దింపేశారు. బ్రేక్ లైనర్ హీట్ కావడంతో టైర్ల నుంచి పొగలు వచ్చినట్లు డ్రైవర్ తెలిపారు. దీంతో సుమారు గంటసేపు ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడ్డారు. అనంతరం మరో బస్సును రప్పించి ప్రయాణికులను అందులో పంపించారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలి


సర్కిల్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నేతలు

ఎల్బీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాలలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి యేసు రత్నం డిమాండ్ చేశారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ మంగళవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాల ఎదుట ఏఐటీయూసీ ఎల్బీనగర్ జోన్ ప్రధాన కార్యదర్శి ఎం.మద్దిలేటి ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా యేసు రత్నం మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులను పర్మినెంట్ చేసే వరకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రహదారులపై పనిచేస్తున్న కార్మికులకు రక్షణ సదుపాయాలు కల్పించాలని అన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుడికి రూ. 25 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలని అన్నారు. రిటైర్మెంట్ అవుతున్న కార్మికులకు రూ. 10 లక్షల బెనిఫిట్ ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి హామీ మేరకు డబుల్ బెడ్ రూం, ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్రన్, రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి, నాయకులు హరిబాబు, శ్రీరాములు, శ్రీనివాసులు, సరస్వతి పాల్గొన్నారు.

గ్రేడ్-3 ఈవోగా వెంకటయ్యకు ప్రమోషన్

చంపాపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో 22 సంవత్సరాలుగా జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటయ్యకు గ్రేడ్-3 ఈవోగా ప్రమోషన్ ఇస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. బుధవారం ఆయన ఆలయం నుంచి రిలీవ్ కానున్నారు. 32 సంవత్సరాల సర్వీస్‌లో వెంకటయ్య కర్మన్‌ఘాట్ శ్రీ హనుమాన్ దేవస్థానంతో పాటు హైదరాబాద్‌లోని పలు ఆలయాల్లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేశారు. కాగా, వెంకటయ్య నవంబరు 30న రిటైర్‌మెంట్ కానున్నారు.

కాశీ విశ్వనాథ ఆలయంలో లింగార్చన

కొత్తపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొత్తపేట స్నేహపురి శ్రీపద్మావతీ గోదాసమేత వేంకటేశ్వరాలయంలోని ఉపాలయం కాశీ విశాలాక్షి అన్నపూర్ణా సమేత విశ్వనాథ ఆలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో లింగార్చన నిర్వహించారు. ఆలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా విశ్వనాథ ఆలయంలో పుట్టమన్నుతో లింగాల రూపాలు తయారుచేసి ఆకర్షణీయంగా అలంకరించారు. మంత్రోచ్చారణల మధ్య లింగార్చన కనుల పండువగా కొనసాగింది. లింగ రూప కాశీ విశ్వనాథ, విశాలాక్షి అమ్మవారు, అన్నపూర్ణాదేవిలనూ రంగు రంగుల పూలతో సుందరంగా అలంకరించారు. పూజల్లో ధర్మకర్తల మండలి పరిసర కాలనీల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట్‌లో లక్షదీపోత్సవం



పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ సూర్యవంశీ గార్డెన్ సిటీ కాలనీలో తాజా మాజీ కౌన్సిలర్ చల్లూరి మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని లక్షదీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగానికి అభిషేకం, కల్యాణం వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి)